క్లుప్తంగా

సంకష్టహర చతుర్థి



పూజలో పాల్గొన్న భక్తులు

యైటింక్లయిన్‌కాలనీ: సంకష్టహర చతుర్థి పర్వదినాన్ని పురస్కరించుకొని రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీలోని శ్రీఅయ్యప్ప స్వామి ఆలయంలో గురువారం రాత్రి శ్రీగణపతి స్వామి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు గణపతి స్వామి మూలవిరాట్‌కు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి హారతి, అర్చన తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆర్జీ–2 ఏరియా వర్క్‌షాప్ డీజీఎం ఎర్రన్న తన కుటుంబ సభ్యులతో కలిసి భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సాంబశివ ఆలయంలో హోమం



హోమం నిర్వహిస్తున్న పూజారి రమేశ్

సుల్తానాబాద్: పట్టణంలోని సాంబశివాలయంలో పూజారి పారువెల్లి రమేశ్ హోమం నిర్వహించారు. శుక్రవారం ప్రత్యేక పూజలు చేసిన అనంతరం హోమం నిర్వహించారు. అనంతరం హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ పల్లా మురళి డైరెక్టర్ శ్రీదేవితో సహా పలువురు పాల్గొన్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు



మహోత్సవాలకు ముస్తాబైన ఆలయం

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని మొట్లపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో 30వ తేదీ నుంచి ఏప్రిల్ 1 వరకు విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ఒక పత్రప్రకటనలో తెలిపింది. లక్ష్మీగణపతి, సుబ్రమణ్య, సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ సహిత నవగ్రహ, మదన పోచమ్మ, ధ్వజస్తంభం శిఖర యంత్రం, శివపార్వతులు, నందీశ్వరుడు, గణపతి విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాలు, హోమం, సామూహిక కుంకుమ పూజలు గ్రామ దేవతల కొలుపు తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉత్సవాల్లో పాల్గొనే భక్తుల కోసం చలువ పందిళ్లు ఏర్పాటు చేశామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఎల్‌వోసీ అందజేత



ఎల్‌వోసీ పత్రం అందజేస్తున్న నాయకుడు

రామగిరి: మండలంలలోని కల్వచర్ల గ్రామానికి చెందిన రేండ్ల సుమలతకు రూ.1,60,000 ఎల్‌వోసీ పత్రం శుక్రవారం అందజేశారు. సుమలత అనారోగ్య సమస్యలతో నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. సాయం కోసం మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లగా వైద్య ఖర్చుల నిమిత్తం రూ.1,60,000 మంజూరు చేశారు. ఆపదలో అండగా ఉన్న మంత్రి శ్రీధర్ బాబుకు సుమలత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

రాములోరి కల్యాణానికి గోటితో ఒలిచిన తలంబ్రాలు



యైటింక్లయిన్‌కాలనీ: ఆర్తి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు విజయ ఆధ్వర్యంలో ఆర్జీ–2 ఏరియా లేడీస్ క్లబ్ వినాయక మండపం ఆవరణంలో శుక్రవారం వడ్లను గోటితో ఒలిచారు. ఆర్జీ–2 ఏరియా క్లబ్ అధ్యక్షురాలు ఆర్జీ–2 జీఎం సతీమణి మాలతి క్లబ్ సభ్యులతో కలిసి భద్రాద్రి సీతారాముల కల్యాణం కోసం గోటితో ఒలిచిన కోటి తలంబ్రాలను పంపించారు. రామదాసు తిరుపతి తన పొలంలో పండించిన వడ్లను మూడేళ్ల నుంచి గోటితో ఒలిచి కోటి తలంబ్రాలు పంపిస్తున్నట్లు పేర్కొన్నారు.

కంకర పోశారు.. వదిలేశారు

- మూడునెలలుగా దుమ్ముతో ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



వాహనాల రాకపోకలతో లేస్తున్న దుమ్ము

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్‌ను అభివృద్ధి చేసేందుకు పాలకులు ఆ దిశగా అడుగులు వేస్తున్నప్పటికీ మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా రోడ్డు నిర్మాణ పనులు ఎక్కడికక్కడ నిలిచిపోతున్నాయి. రోడ్డుపై వస్తున్న దుమ్ము, కంకర రాళ్లతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వందరోజులుగా ఇదే పరిస్థితి

ఎన్టీపీసీ రామగుండం ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్ నుంచి పర్మనెంట్ టౌన్‌షిప్ రింగ్ రోడ్ వరకు రోడ్డు నిర్మాణం కోసం గత సంవత్సరం జనవరిలో పట్టణ ప్రగతి నిధుల నుంచి రూ.2కోట్లు కేటాయించి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. సంవత్సరం గడుస్తున్నప్పటికీ రోడ్డు పనులు ఇంకా పూర్తి కావడం లేదు. కొన్నిరోజుల క్రితం రోడ్డు పనులను ప్రారంభించిన సదరు కాంట్రాక్టర్ కంకర పోశారు. 100రోజులుగా తారు వేయకపోవడంతో రోడ్డుపై విపరీతంగా వస్తున్న దుమ్ముతో ప్రజలు తిప్పలు పడుతున్నారు.

నీరు చల్లడం మరిచారు..

ఇటీవల రోడ్డుపై దుమ్ము వస్తున్న క్రమంలో స్థానిక కార్పొరేటర్ కొలిపాక సుజాత సదరు కాంట్రాక్టర్‌తో పాటు మున్సిపల్ అధికారులకు తెలియజేశారు. తూతూ మంత్రంగా నీటి చల్లింపు చేపట్టి మళ్లీ నీరు చల్లడం మరిచారు. దీంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు రోడ్డుపై వెళ్తున్న క్రమంలో కళ్లలో దుమ్ము పడుతోందని ఆవేదన చెందుతున్నారు.

పనులు పూర్తి చేయాలి



ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్ నుంచి రింగ్ రోడ్ వరకు వెళ్తే ముక్కు, నోరు మూసుకుని వెళ్లాల్సి వస్తోంది. దుమ్ము కళ్లలో పడడంతో కంకర రోడ్డుపై వాహనాలు పడిపోతున్నాయి. చాలా రోజులుగా నీటిని కూడా చల్లకపోవడంతో దుమ్ము ఎక్కువగా లేస్తోంది. మున్సిపల్ అధికారులు ప్రజల ఇబ్బందులపై దృష్టిసారించి రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించాలి.

– అబ్దుల్లా, కాంట్రాక్టు కార్మికుడు

నిర్లక్ష్యానికి నిదర్శనం



ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్ నుంచి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ రోడ్డు పనులను మధ్యలో నిలిపివేయడంలో కారణాలేంటి. పనులు నిర్వహించకుండా ఉన్న కాంట్రాక్టర్‌పై మున్సిపల్ అధికారులు చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు. మూడునెలల నుంచి ఇబ్బంది పడుతుంటే కనీసం నీరు కూడా చల్లకుండా ఉండడం నిర్లక్ష్యానికి నిదర్శనం అవుతుంది.

– చిలుక శంకర్, ఐఎఫ్‌టీయూ నాయకులు

నిబంధనలు పాటించకపోతే వాహనాలు సీజ్



బ్లాక్ స్టిక్కర్లు తొలగిస్తున్న మంథని సీఐ ఎస్.వెంకటేశ్వర్లు

రామగిరి: వాహనాదారులు రవాణాశాఖ నిబంధనలు పాటించకపోతే వాహనాలను సీజ్ చేస్తామని మంథని సీఐ ఎస్.వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం రామగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని సెంటనరీకాలనీ పన్నూర్ క్రాస్‌రోడ్ వద్ద విస్తృతంగా వాహనాలను తనిఖీ చేశారు. నంబర్ ప్లేట్ లేని వాహనాలను పోలీసు స్టేషన్‌కు తరలించారు. నిబంధనలకు విరుద్ధంగా కార్లకు వేసిన బ్లాక్ స్టిక్కర్లను తొలగించి జరిమానా విధించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ వాహనాదారులు తప్పనిసరిగా ధ్రువీకరణ పత్రాలను కలిగి ఉండాలని లేకపోతే కేసు నమోదు చేయడంతో పాటు జరిమానా విధిస్తామన్నారు. వాహనాదారులు అనుమతి లేకుండా బ్లాక్ స్టిక్కర్లు వాడినా, సైరన్‌లు వాడినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్సై కె.సందీప్‌కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



మంథని: శిలువ ధ్యాన సువార్త నిర్వహణ



సుల్తానాబాద్ చర్చిలో ప్రార్థనలు

గుడ్ ఫ్రైడే వేడుకలు

ఎలిగేడు: మండలంలోని ధూళికట్ట, ముప్పిరితోట, ఎలిగేడు, ర్యాకల్‌దేవుపల్లి, రాములపల్లి, లాలపల్లి, సుల్తాన్‌పూర్ తదితర గ్రామాల్లో గుడ్‌ఫ్రైడే వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ధూళికట్టలోని బేరాకా క్రిస్టియన్ మినిస్ట్రీస్ ఫాస్టర్ జేమ్స్, మత పెద్దలు లాజరు, పేతురు, బెంజిమన్, కుట్టి, శాంతి, డేవిడ్, రత్నం, సామేల్ పాల్గొన్నారు.

సుల్తానాబాద్: పట్టణంలోని పలు చర్చిల్లో గుడ్ ఫ్రైడే వేడుకలు నిర్వహించారు. శుక్రవారం ప్రార్థనలు చేసిన అనంతరం ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని దీవించారు.

గోదావరిఖనిటౌన్: గోదావరిఖనిలోని సెక్రెడ్ హార్ట్ చర్చిలో గుడ్ ఫ్రైడే వేడుకలు నిర్వహించారు. ఏసు క్రీస్తు జీవిత చరిత్రను తెలిపేలా క్రీస్తు వేషధారణతో నాటిక ప్రదర్శించారు. సెక్రెడ్ హార్ట్ చర్చి గురువు రేవ రివరెండ్ ఫాదర్ రామప్పరెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ ఫాదర్ డోనిమిక్ రెవరెండ్ ఫాదర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

జూలపల్లి: మండల కేంద్రంతో పాటు వడ్కాపూర్, కుమ్మరికుంట, పెద్దాపూర్ గ్రామాల్లో గుడ్ ఫ్రైడే వేడుకలు జరుపుకున్నారు. ఎంపీపీ రమాదేవి, జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్ పాల్గొన్నారు.

మంథనిలో శిలువ ధ్యాన సువార్త

మంథని: మంథనిలోని సియోను మందిరంలో మానవుల కోసం ఏసుక్రీస్తు చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. మంథని పురవీధుల్లో సిలువ ధ్యాన సువార్త నిర్వహించారు. పాస్టర్లు వల్లూరి ప్రభాకర్, పెండ్రు ప్రసన్నకుమార్, దూడ మహేశ్, కల్వల సామ్యేల్, అజ్మీర దయారాజ్, మార్క్, గద్దల రాజేశ్, సంఘం పెద్దలు అంకరి కుమార్, రామగిరి కుమార్, ఈర్ల సదానందం, ప్రేమ్‌కుమార్, ప్రసాద్, రమేశ్, దాసరి సదానందం ఉన్నారు.



ఎలిగేడు మండలం ధూళికట్టలో..



జూలపల్లిలోని చర్చిలో ప్రార్థనలు

జాతీయ మేనిఫెస్టో కమిటీ చైర్మన్‌కు సన్మానం



మంథని: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ మేనిఫెస్టో కమిటీ చైర్మన్‌గా నియమితులైన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును మున్నూరు కాపు సంఘం మహాసభ నాయకులు సన్మానించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఆదర్శనగర్‌లోగల ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మంత్రికి శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. హైదరాబాద్ నగర మున్నూరు కాపు సంఘం మహాసభ అధ్యక్షుడు గడ్డి రాజశేఖర్, పెద్దపల్లి జిల్లా సంఘం మహాసభ కన్వీనర్ ఇనుముల సతీశ్, భూపాలపల్లి జిల్లా నాయకుడు తుల్సెగారి తిరుపతి పాల్గొన్నారు.

ప్రారంభమైన ఎల్లమ్మ కొలుపు ఉత్సవాలు



కమాన్‌పూర్: మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే ఎల్లమ్మ కొలుపు ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. గురువారం రాత్రి ఎల్లమ్మ కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించగా శుక్రవారం గ్రామంలో గౌడ కులస్తులు ఇంటింటా జోగి తిరిగి బియ్యం సేకరించారు.

పెద్దపల్లిలో బీజేపీ విజయం ఖాయం



ప్రచారం చేస్తున్న పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు సునీల్‌రెడ్డి

మంథని: పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో బీజేపీ సంచలన విజయం సాధించబోతోందని పార్టీ జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం రాత్రి పార్లమెంట్ అభ్యర్థి గోమాస శ్రీనివాస్‌తో కలిసి మంథనిలో ప్రచారం నిర్వహించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో జరిగిన జిల్లా స్థాయి సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, బీజేపీకే ప్రజల మద్దతు ఉందన్నారు. కార్యక్రమంలో పార్లమెంట్ కన్వీనర్ నగునూరి వెంకటేశ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కొండపాక సత్యప్రకాష్, అసెంబ్లీ కన్వీనర్ మల్క మోహన్‌రావు, కోకన్వీనర్ నాంపల్లి రమేశ్ ఉన్నారు.

కార్మికుల సమస్య పరిష్కారానికి కృషి

పాలకుర్తి: కేశోరాం కంపెనీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పెద్దపల్లి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పాలకుర్తి మండలం బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారంలో కార్మికులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రధాని మోదీ అభ్యర్థిత్వాన్ని బలపర్చి స్థానికంగా తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం ఈసాలతక్కళ్లపల్లి, పాలకుర్తి గ్రామాల్లో ఉపాధి హామీ కూలీల పనిస్థలాల వద్దకు వెళ్లి వారిని ఓట్లు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి జెడ్పీటీసీ సంధ్యారాణి, నాయకులు పాత దేవేందర్, శ్రీరామోజు తిరుమలాచారి, వాసాల పద్మ, శ్రీరాముల సత్యం, గండికోట కుమార్, నరేశ్, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు 50శాతం ఇవ్వాలి



సీఎం రేవంత్ రెడ్డితో మహేందర్

సుల్తానాబాద్: రాష్ట్ర ప్రభుత్వం నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు 50శాతం కేటాయించాలని సీఎం రేవంత్ రెడ్డిని కలిసి విన్నవించినట్లు బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ తెలిపారు. శుక్రవారం సీఎంను మర్యాదపూర్వకంగా కలిసి విన్నవించారు.

మహాసభను విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి ఉద్యోగుల సంఘం రామగుండం రీజియన్ మహాసభను విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి కుమారస్వామి కోరారు. శుక్రవారం యైటింక్లయిన్‌కాలనీ ప్రెస్‌భవన్‌లో మహాసభకు సంబంధించిన పోస్టర్‌ను నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఏప్రిల్ 7న గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించనున్న సింగరేణి ఉద్యోగుల సంఘం రామగుండం రీజియన్ మహాసభలో సింగరేణి కార్మికులు, ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. సంఘం నాయకులు జైపాల్ సింగ్, కనకయ్య, బీరయ్య, వెంకటేశం, చందు, పోచన్న పాల్గొన్నారు.

వ్యాపారస్తులకు నష్టం జరగకుండా చూస్తా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: రోడ్డు విస్తరణలో వ్యాపారస్తులకు ఎలాంటి నష్టం జరగకుండా చూస్తానని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ అన్నారు. శుక్రవారం రాత్రి లక్ష్మీనగర్‌లో కాలినడకన పర్యటిస్తూ రోడ్డుపై షాపు పెట్టుకుని జీవిస్తున్న ప్రతి ఒక్కరినీ కలిసి తానున్నానంటూ ధైర్యం చెప్పారు. ఎవరికీ నష్టం జరకుండా ప్రణాళికాబద్ధంగా ముందుకువెళ్తున్నామన్నారు. మరో రెండు దశాబ్దాలకు అనుగుణంగా ఈప్రాంత అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు బొంతల రాజేశ్, మహంకాళిస్వామి తదితరులు ఉన్నారు.

చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయం చూపించాలి



మాట్లాడుతున్న కోరుకంటి చందర్

గోదావరిఖని: చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయం చూపించకుండా కూల్చివేతలు చేపట్టడం సరికాదని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రధాన చౌరస్తా సమీపంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్ధరాత్రి కూల్చివేతలు చేపట్టడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. అభివృద్ధి చేయాలనుకున్నప్పుడు వ్యాపారంపై ఆధారపడి జీవిస్తున్న వారికి ప్రత్యామ్నాయం చూపాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పాలనతో ప్రజలు విసిగిపోతున్నారన్నారు. రైతుల సమస్యలపై బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో శనివారం పెద్దపల్లి పార్టీ కార్యాలయంలో 36 గంటల రైతు నిరసన దీక్ష చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. రామగుండం నియోజకవర్గంలోని రైతులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. నాయకులు నడిపెల్లి మురళీధర్‌రావు, కల్వచర్ల కృష్ణవేణి, పీటీ స్వామి, గోపు ఐలయ్యయాదవ్, పర్లపల్లి రవి, మెతుకు దేవరాజ్, మాదాసు రామ్మూర్తి, వడ్డేపల్లి శంకర్, పీచర శ్రీనివాస్, మొగిలి దొమ్మేటి వాసు, ముద్దసాని సంధ్యారెడ్డి, స్వప్న, మహేందర్, ప్రశాంత్, అరవింద్, బొడ్డు రవీందర్, గంగాధర్, తిమోతి, రమేశ్, శ్రీకాంత్, జేవీరాజు, కిషన్ పాల్గొన్నారు.





ఇఫ్తార్ విందులో పాల్గొన్న మైనార్టీలు, ఎమ్మెల్యే విజయరమణారావు, ఎమ్మెల్సీ భానుప్రసాదరావు

ఇఫ్తార్ విందు

పెద్దపల్లిరూరల్: రంజాన్ మాసం సందర్భంగా పెద్దపల్లిలో శుక్రవారం కాంగ్రెస్ నాయకుడు రేగుంట అశోక్‌గౌడ్ మైనార్టీలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే విజయరమణారావు, ఎమ్మెల్సీ భానుప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి ప్రాణప్రతిష్ఠ వేడుకలు



బొడ్రాయి వేడుకలకు హాజరైన భక్త జనం



పూజల్లో ఎమ్మెల్యే సతీమణి మనాలిఠాకూర్

రామగుండం: రామగుండం కార్పొరేషన్ ఒకటో డివిజన్ పరిధిలోని అబాది రామగుండంలో శుక్రవారం బొడ్రాయి ప్రాణ ప్రతిష్ఠ వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా డివిజన్ ప్రజలతో పాటు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ఠాకూర్ సతీమణి మనాలిఠాకూర్ హాజరయ్యారు.

కార్మిక పాలసీని ప్రకటించాలి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

జ్యోతినగర్: రాష్ట్ర ప్రభుత్వం కార్మిక పాలసీని వెంటనే ప్రకటించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు లేబర్ గేట్ రోడ్‌లో చేపట్టిన కార్యక్రమంలో సీఐటీయూ అనుబంధ రామగుండం ఇండస్ట్రియల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నాంసాని శంకర్ పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలోని అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనాలు పెంచాలని, సీఐటీయూ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర సీఎంకు లేఖ పంపిస్తూ, యూనియన్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టినట్లు పేర్కొన్నారు. పదేళ్లుగా అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం కార్మికులపై నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఆరోపించారు. ప్రజాపాలన అని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే కనీస వేతన జీవోలపై ప్రభుత్వం ఇచ్చిన ప్రిలిమినరీ నోటిఫికేషన్ రద్దుచేసి గత ప్రభుత్వం ఇచ్చిన జీవో నెంబర్–22ను గెజిట్ చేసి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రూ.26వేలు కనీస బేసిక్‌గా ఉండేలా కనీస వేతనాలు పెంచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాఘవరెడ్డి, రాజకుమార్, చంద్రమౌళి, శ్రీనివాస్, వెంకన్న, శ్రీనివాస్, రవి, పరమేశ్, భాస్కర్, శ్రీనివాస్, పోచయ్య పాల్గొన్నారు.

పెద్దపల్లి ఎంపీ టికెట్ మాదిగలకే ఇవ్వాలి



ఢిల్లీలో నిరసన తెలుపుతున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేసే అవకాశాన్ని మాదిగలకే ఇవ్వాలంటూ ఢిల్లీలోని ఏఐసీసీ ఆఫీసు ఎదుట మాదిగశక్తి, జేఏసీ, రాజకీయవేదిక, దండోరా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించిన గడ్డం వంశీ తండ్రి వివేక్, పెద్దనాన్న ఎమ్మెల్యేలుగా ఉన్నారని అదే కుటుంబం నుంచి పార్లమెంట్ స్థానం నుంచి పోటీకి అవకాశం కల్పించడం సరికాదని అన్నారు. పార్టీ అధిష్టానం పునరాలోచించాలని కోరారు. కార్యక్రమంలో మాదిగశక్తి వ్యవస్థాపకుడు బొంకూరి సురేందర్‌సన్నీ, నాయకులు రవి, సతీశ్, కిశోర్, పర్వతాలు, చంద్రు, సందీప్, నర్సయ్య, పవన్, కాంతయ్య, రాజేశ్వరి, సుజాత, శారద తదితరులు పాల్గొన్నారు.

దేశం అభివృద్ధి చెందాలంటే బీజేపీకే పట్టం కట్టాలి

సుల్తానాబాద్: నరేంద్ర మోదీ మూడోసారి పీఎం అవడం ఖాయమని బీజేపీ మండల అధ్యక్షుడు రాజన్న పటేల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎస్‌ఆర్ గార్డెన్‌లో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశం అభివృద్ధి చెందాలంటే ప్రజలు బీజేపీకే పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. పంటలు చివరి దశలో ఉన్నందున ఏప్రిల్ 15 వరకు ఎస్సారెస్పీ కాలువల ద్వారా నీరు అందించాలని కోరారు. నాయకులు మహేందర్, లంక శంకర్, అల్లెంకి రాజన్న, సతీశ్, శంకర్, సాయిచరణ్, శ్రీనివాస్, వెంకటేశ్, మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు మూలుక భాగ్యలక్ష్మి, మారుతి, కుమార్‌రెడ్డి, రామస్వామి, మహేశ్ గౌడ్, సంతోష్‌రెడ్డి ఉన్నారు.